
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం । 10 । మే । 2025



సోమశిలలో 50.425 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారం 50.425 టీఎంసీల నీరుంది. పెన్నార్ డెల్టాకు 4030, ఉత్తరదక్షిణ కాలువలకు 80 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.99,600
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,015
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,285
సవర (8 గ్రాములు)	రూ.74,280

వాతావరణం

గరిష్టం/కనిష్టం 39.7 /26.7

శనివారం జిల్లాలో పొడి వాతావరణం ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ శుక్రవారం 61 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

మధుసూదన్ కుటుంబసభ్యులకు కేంద్ర మంత్రి పరామర్శ



మధుసూదన్‌రావు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ

కావలి (జలదంకి): పహల్గాం ఉగ్ర దాడిలో మృతి చెందిన కావలికి చెందిన మధుసూదన్‌రావు కుటుంబసభ్యులను కేంద్ర భారీ ఉక్కు పరిశ్రమల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మధుసూదన్‌రావు భార్య కామాక్షి ప్రసన్న, పిల్లలతో మాట్లాడి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రభుత్వం వారి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కావలి బీజేపీ నేతలు పాల్గొన్నారు.

రుణాల రికవరీలు వందశాతం సాధించాలి

- డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి



మాట్లాడుతున్న పీడీ నాగరాజకుమారి

నెల్లూరు (పొగతోట): బ్యాంకు లింకేజీ రుణాలు, స్త్రీ నిధి రుణాలకు సంబంధించి వంద శాతం రికవరీలు సాధించాలని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి డీపీఎం, ఏసీలు, ఏపీఎంలను ఆదేశించారు. డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో డీపీఎంలు, ఏసీలు, ఏపీఎంలతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి యాన్యువల్ క్రెడిట్ లైవ్‌లీహుడ్ ప్లాన్ నుంచి మైక్రో క్రెడిట్ ప్లాన్‌ను సిద్ధం చేయాలని సూచించారు. దీనికి సంబంధించి బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్ తదితర విభాగాల నుంచి స్వయం సహాయక మహిళలకు ఆర్థిక సహకారం అందించి వారిని వ్యాపారవేత్తలుగా తయారు చేయాలన్నారు. జూన్ 8వ తేదీ లోపు వెయ్యి మంది మహిళలను గుర్తించి వారికి ఉపాధి కల్పించాలన్నారు. వందశాతం మొబైల్ బుక్ కీపింగ్ చేయాలన్నారు. సీఐఎఫ్ నిధులను సక్రమంగా ఉపయోగపడేలా చర్యలు చేపట్టాలన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.177 కోట్లు స్త్రీ నిధి రుణాలు మంజూరుచేసి వంద శాతం లక్ష్యాన్ని సాధించడం జరిగిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.300 కోట్ల రుణాలు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. పీఎం సూర్యఘర్ పథకానికి సంబంధించి సోలార్ పలకలను మండలాలకు కేటాయించి ఏపీఎంలు లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీపీఎంలు, ఏసీలు, ఏపీఎంలు, ఐటీడీఏ ఏపీఓ, బ్యాంకు అధికారులు స్త్రీ నిధి ఏజీఎం కామాక్షయ్య పాల్గొన్నారు.

చిన్నారులపై నిర్దయ

మండే ఎండల్లో అంగన్వాడీ కేంద్రాలు

- ఉక్కపోతతో అల్లాడుతున్న పిల్లలు
- ప్రభుత్వ బడులు, కాలేజీలకు సెలవులు
- వీరికి మాత్రం కిశోరి వికాసం పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు
- ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న తల్లిదండ్రులు



అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులు

ఉదయగిరి: అసలే మండే ఎండలు.. పెద్దలు సైతం ఉదయం 8 గంటలు దాటితే ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి. ఇప్పటికే ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీలకు సెలవులు ప్రకటించిన ప్రభుత్వం... చిన్నారులు ఉండే అంగన్వాడీ కేంద్రాలకు మాత్రం సెలవులు ప్రకటించకుండా కాఠిన్యం ప్రదర్శిస్తోంది. ఈ వేసవిలో భానుడు సెగలు కక్కుతూ తన ప్రతాపం చూపిస్తున్నాడు. దీంతో ఆరేళ్ల వయస్సు లోపు బడి పిల్లలు ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. పైగా చాలాచోట్ల చాలీచాలని ఇరుకు గదులు, రేకుల ఇళ్లలో చంటిబిడ్డల బాధలు వర్ణనాతీతం. మే నెల నుంచి అంగన్వాడీ కార్యకర్తలకు 15 రోజులు, సహాయకులకు 15 రోజులు సెలవులు ఇచ్చారు. అయినా వీరిలో ఎవరో ఒకరు కేంద్రాలు నడపాల్సిందే. ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల తరహాలోనే తమకూ సెలవులు ఇవ్వాలని అంగన్వాడీలు ప్రభుత్వాన్ని కోరుతున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

యాప్‌లతో తిప్పలు

ఇప్పటికే రకరకాల యాప్‌లతో అంగన్వాడీ టీచర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పోషణ్, బాల సంజీవిని తదితర యాప్‌లతో సమస్యలు ఉన్నాయని, దీనికి తోడు గతంలో ఇచ్చిన 2జీ సెల్‌ఫోన్లతో నెట్‌వర్క్, సాంకేతిక సమస్యలు ఇబ్బంది పెడుతున్నట్లు కార్యకర్తలు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో వేసవిలో ఉదయం 8గంటల నుంచి 12 గంటల వరకు చిన్నారులకు ఒంటిపూట బడి పెట్టాలని, కార్యకర్తలు సాయంత్రం 4 గంటల వరకు కేంద్రాల్లో ఉండాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో టీచర్లు, ఆయాలు, చిన్నారులు ఎండ వేడిమితో తల్లడిల్లుతున్నారు.

కిశోరి వికాసం పేరుతో అదనపు భారం

అంగన్వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించని ప్రభుత్వం కిశోరి వికాసం పేరుతో మే 2 నుంచి జూన్ 10 తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ కార్యక్రమాన్ని తప్పు పట్టాల్సిన అవసరం లేకున్నా, వేసవి సెలవుల్లో నిర్వహించడం పట్ల విమర్శలు వస్తున్నాయి. కిశోరి వికాసం ద్వారా అంగన్వాడీలు ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఏఎన్‌ఎం, స్కూల్ కమిటీలతో కలిసి కిశోరి బాలికలు, డ్రాప్ అవుట్స్, బాల్యవివాహాలు, పుట్టినబిడ్డల ఆరోగ్యం తదితర అంశాలు గురించి అవగాహన కల్పించే నిమిత్తం వేసవిలో సమావేశాలు నిర్వహించాలి. కానీ ఎండ తీవ్రతతో సమావేశాల నిర్వహణ సంక్లిష్టంగా మారింది.

ఉక్కపోతతో సతమతం

మే మాసంలో ఎండల తీవ్రత చాలా ఎక్కువగా ఉంది. ఉదయం 8 గంటలకే ఎండలు మండిపోతున్నాయి. కేంద్రాల్లో ఫ్యాన్లు ఉన్నా ఉక్కపోతతో చిన్నారులు అల్లాడిపోతున్నారు. వారిని సముదాయించడం ఆయాలకు తలకు మించిన భారంగా మారింది. దీనికి తోడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం సమస్యగా మారింది. అలాగే గర్భిణులు, బాలింతలు మండే ఎండలో పౌష్టికాహారం కోసం కేంద్రాలకు రావడం సమస్యగా మారింది. ఇన్ని కష్టాలున్న నేపథ్యంలో అంగన్వాడీ కేంద్రాలకు కూడా వేసవి సెలవులు ఇవ్వాల్సిన అవసరం ఉంది.

ఇవీ వివరాలు

జిల్లాలో ఉన్న ప్రాజెక్టులు	- 12
మొత్తం కేంద్రాలు	- 2,934
కేంద్రాలకు వచ్చే చిన్నారులు	- 48,908
పౌష్టికాహారం కోసం కేంద్రాలకు వచ్చే గర్భిణులు	- 11,663
బాలింతలు	- 13,908

సెలవులు ప్రకటించాలి



రాష్ట్రంలో ఉన్న అన్ని విద్యా సంస్థలకు ఇచ్చిన విధంగానే తమకూ వేసవి సెలవులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరాం. కానీ ఇంతవరకు పట్టించుకోలేదు. వేసవిలో పౌష్టికాహారం లబ్ధిదారుకు ఇంటికి ఇచ్చే అవకాశం ఉంది. కానీ ప్రభుత్వం ఆ దిశలో చర్యలు తీసుకోవడం లేదు. ఎన్నికలకు ముందు పనిభారం తగ్గిస్తామని చెప్పినా ఇప్పుడు భారం మరింత పెంచుతోంది. జీతాల విషయంగానీ, వేసవి సెలవులు విషయం గానీ ఆలోచన కూడా చేయకపోవడం దారుణం.

– కాకు వెంకటయ్య, సీఐటీయూ నేత

చిన్నారులను ఇబ్బందిపెట్టం



అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఫీడింగ్ సమస్య లేకుండా ఉండేందుకు కేంద్రాలు నడుపుతున్నాం. ఉదయం 8 గంటల నుంచి 11గంటల వరకు చిన్నారులను కేంద్రాల్లో ఉంచుతున్నాం. టీచర్లు, ఆయాలకు 15 రోజులు చొప్పున సెలవులు ఇస్తున్నాం. వేసవిలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– సువర్ణ, పీడీ, ఐసీడీఎస్

పేదల గృహ నిర్మాణాల పూర్తికి చర్యలు

- కలెక్టర్ ఆనంద్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు రూరల్: జిల్లాలో పేదల గృహ నిర్మాణాలను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని గృహ నిర్మాణశాఖ అధికారులను కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వారి ఛాంబర్‌లో ఎన్టీఆర్ హౌసింగ్ పురోగతిపై శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇళ్ల నిర్మాణ దశలను పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఆప్షన్‌–3 కింద లబ్ధిదారులకు కాంట్రాక్టర్లు నిర్మిస్తున్న ఇళ్లను ఇంజినీరింగ్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. నల్లరేగడి నేలల్లో నిర్మిస్తున్న ఇళ్ల పునాదుల నాణ్యతను సంబంధిత అధికారులు పరిశీలించి సర్టిఫై చేయాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వేణుగోపాల్, ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, విద్యుత్‌శాఖల ఏఈలు గంగాధర్, వెంకటరమణ, విజయన్, అశోక్ కుమార్, డీఈలు జహీరుద్దీన్, నారాయణరెడ్డి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



శేష వాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

నృసింహుడి క్షేత్రోత్సవం

- వేలాదిగా దర్శించుకున్న భక్తులు
- ఉత్సవాలకు సకల దేవతలకు ఆహ్వానం

రాపూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన క్షేత్రంలో శుక్రవారం రాత్రి పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవేరులతో కలిసి శేషవాహనంపై ఊరేగారు. శేషవాహనాన్ని వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి అందులో స్వామి వారు, దేవేరుల ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి పెంచలకోనలోని తిరు మాడవీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. అంతకుముందు ఉదయం ధ్వజారోహణ కార్యక్రమాన్ని వేదపండితులు వేడుకగా నిర్వహించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు తరలిరావాలంటూ గరుడి ద్వారా సకల దేవతలకు ఆహ్వానం పంపారు. వేదమంత్రాల నడుమ గరుత్మంతుడి చిత్రపటాన్ని ధ్వజస్తంభం పైకి ఎగురవేశారు. కార్యక్రమంలో డీసీ సాగర్ బాబు, చెంగాళమ్మ దేవస్థానం ఏసీ వెంకటేశ్వర్లు, ఉప ప్రధానార్చకులు పెంచలయ్యస్వామి, సీతారామయ్యస్వామి, తిరుమల తిరుపతి దేవస్థాన పాంచరాత్ర ఆగమపండితులు రామానుజాచార్యులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. గరుత్మంతుడికి పూజలు అభిషేకాలకు ఉపయోగించిన ప్రసాదాలను స్వీకరిస్తే సంతాన ప్రాప్తి కలుగుతుందన్న విశ్వాసంతో మహిళలు పెద్ద సంఖ్యలో ప్రసాదం కోసం పోటీపడ్డారు.

ప్రభుత్వ బడులను పరిరక్షించండి



కలెక్టరేట్ వద్ద ధర్నాలో ఉపాధ్యాయులు

- విద్యా విధానంలో సర్కారు తీరుపై నిరసన
- ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయుల ధర్నా

నెల్లూరు(అర్బన్): ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలని కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులు కలెక్టరేట్ వద్ద శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దశరథరాములు, హజరత్‌లు మాట్లాడారు. ప్రభుత్వం రోజుకో నిర్ణయంతో విద్యావిధానంలో గందరగోళ పరిస్థితులను కల్పిస్తోందని విమర్శించారు. ప్రతి ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5 తరగతులు కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని, ఉన్నత పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతో సమాంతరంగా తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలని కోరారు. నూతనంగా అప్‌గ్రేడ్ చేసిన ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా హెడ్‌మాస్టర్, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు మంజూరు చేయాలన్నారు. సీపీఎస్, జీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని(ఓపీఎస్) అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6, 7 తరగతులున్న చోట 4 స్కూల్ అసిస్టెంట్ పోస్టులను, 6,7,8 తరగతులున్న చోట 6 స్కూల్ అసిస్టెంట్ పోస్టులను కేటాయించాలి కోరారు. లేదంటే భవిష్యత్‌లో ఐక్య ఉద్యమాలు చేపడతామన్నారు. అనంతరం కలెక్టరేట్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో ఆ సంఘం నాయకులు సురేఖ, రఘురామిరెడ్డి, శరత్ బాబు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మీడియా స్వేచ్ఛను హరించడమే

- సాక్షి ఎడిటర్ ఇంట్లో పోలీసుల తనిఖీలపై జర్నలిస్టుల నిరసన

మనుబోలు: మీడియా స్వేచ్ఛను ప్రభుత్వం హరించడం దుర్మార్గమని జాప్ రాష్ట్ర కోశాధికారి పాశం ఏడుకొండలు, గూడూరు ప్రింట్ మీడియా డివిజన్ గౌరవాధ్యక్షుడు బాబు మోహన్‌దాస్ అన్నారు. సాక్షి పత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డిని పోలీసులు వేధింపులకు గురిచేస్తున్న తీరుకు నిరసనగా మనుబోలు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ బషీర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంటిలోకి పోలీసులు అనుమతి లేకుండా ప్రవేశించడమే కాకుండా తనిఖీల పేరుతో హంగామా సృష్టించారని విమర్శించారు. ఇటీవల కావలిలో జర్నలిస్టులను అక్రమంగా అరెస్ట్ చేసి వేధించడాన్ని కూడా తీవ్రంగా ఖండించారు. తమకు నచ్చిన విధంగా వార్తలు రాయలేదనే కారణంతో జర్నలిస్టులు, మీడియా కార్యాలయాలపై ప్రభుత్వం పోలీసుల చేత దాడులు చేయించడం హేయమైన చర్య అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు జగదీష్ బాబు, సుధాకర్, జయకర్, శివాజీ శ్రీను, ఒలిపి శ్రీనివాసులు, రవీంద్ర, బాషా, శంకర్, సాయి, సునీల్, శ్రీధర్ తదితరులతో పాటు పలువురు యూట్యూబ్ చానళ్ల విలేకరులు పాల్గొన్నారు.



డీటీకి వినతిపత్రం ఇస్తున్న మీడియా ప్రతినిధులు

పత్రికా స్వేచ్ఛపై నిబంధనలా?



నెల్లూరు (టౌన్): పత్రికా స్వేచ్ఛను కాలరాయడం కూటమి ప్రభుత్వానికి మంచిది కాదు. జర్నలిస్టులు రాసే వార్తలపై నిబంధనలు విధించకూడదు. వాస్తవాలను ప్రచురించే స్వేచ్ఛను వారికి కల్పించాలి. సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డికి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా పోలీసులు దౌర్జన్యంగా ఇంటిలోకి ప్రవేశించి తనిఖీలు చేయడం పత్రికకు సంకెళ్లు వేయడంగా భావించాలి. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న తప్పు ఒప్పులను ఎత్తి చూపే స్వేచ్ఛ జర్నలిస్టులకు ఉంటుంది. వార్తలు రాసిన జర్నలిస్టులపై దాడులకు పాల్పడటం మంచి పద్ధతి కాదు. – బసిరెడ్డి రఘురామిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు, వైఎస్సార్‌టీఎఫ్

నాజీల పాలనను తలపిస్తోంది



నెల్లూరు (బృందావనం): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలను తూర్పారబడుతూ ప్రజల పక్షాన నిలిచిన 'సాక్షి' దినపత్రిక, ఆ పత్రిక ఎడిటర్‌ను ధనంజయరెడ్డిని వేధింపులకు గురిచేయడం నిరంకుశ నాజీల పాలనకు అద్దం పడుతోంది. ప్రచార మాధ్యమాల పట్ల కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం ప్రజాప్రభుత్వ మనుగడకు ప్రమాదకరం. పత్రికలలో ప్రచురితమయ్యే కథనాలలో ఉన్న వాస్తవాలను విచారించుకుని వాటిని సరిదిద్దుకుంటే పాలకుల తీరును ప్రజల హర్షిస్తారు.

– ఎల్లంకి వెంకటేశ్వర్లు, కార్యదర్శి, జిల్లా పౌరహక్కుల సంఘం

రాజ్యాంగ హక్కులను కాలరాయడమే



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే విధంగా నేడు రాష్ట్రంలో కూటమి సర్కార్ వ్యవహరిస్తోంది. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియచేస్తూ, ప్రజలను చైతన్యవంతం చేస్తున్న సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంట్లో సోదాలు జరపటం, సాక్షి విలేకర్లపై అక్రమ కేసులు బనాయించటం సరైన పద్ధతి కాదు. మీడియాపై ఆంక్షలు పెట్టటం ఫాసిజమే అవుతుంది. ఇది ముమ్మాటికీ రాజ్యాంగం కల్పించిన పత్రికా స్వాతంత్ర్యపు హక్కును హరించటమే.

– మస్తాన్‌బీ, ఐద్వా జిల్లా కార్యదర్శి

అది హేయమైన చర్య



నెల్లూరు(వీఆర్సీసెంటర్): సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డి నివాసంలోఎలాంటి అనుమతులు లేకుండా పోలీసులు సోదాలు చేసి కుటుంబసభ్యులను భయభ్రాంతులకు గురి చేయటం హేయమైన చర్య. పత్రికాస్వేచ్ఛకు భంగం కలిగించే విధంగా ప్రభుత్వం నడుచుకుంటోంది. ప్రభుత్వంలో మహిళలు, చిన్నారులతోపాటు జర్నలిస్టులకు కూడా రక్షణ లేకుండా పోయింది. జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టటం ప్రశ్నించే గొంతును నొక్కేయడమే.

– డి.అన్నపూర్ణమ్మ, శ్రామిక మహిళా సంఘం జిల్లా కార్యదర్శి

క్లుప్తంగా

బావతో సహజీవనం చేస్తోందంటూ..

- మహిళపై కొడవలితో దాడి చేసిన బావమరిది
- తీవ్రగాయాలతో హాస్పిటల్లో చికిత్స

నెల్లూరు సిటీ: మహిళపై కొడవలితో దాడి చేసిన ఘటన నెల్లూరు రూరల్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తోటపల్లిగూడూరు మండలానికి చెందిన శేషమ్మ అనే మహిళను 20 ఏళ్ల క్రితం భర్త వదిలేశాడు. ప్రస్తుతం ధనలక్ష్మీపురంలో నివాసం ఉంటూ కేజీకే కల్యాణ మండపం వద్ద పండ్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తోంది. తోటపల్లిగూడూరు మండలానికి చెందిన కరుణాకరన్‌తో ఆమె సహజీవనం చేస్తోంది. అతను ఇంటికి వెళ్లకుండా ఎక్కువ సమయం శేషమ్మ వద్ద ఉండటం అతడి బావమరిది శ్రీనివాసులుకు తెలిసింది. తన సోదరికి అన్యాయం జరుగుతోందని అతను శేషమ్మపై కోపం పెంచుకున్నాడు. శుక్రవారం పండ్ల దుకాణం వద్ద శ్రీనివాసులు కొడవలితో శేషమ్మ మెడపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు హాస్పిటల్‌కు తరలించారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధిలో శ్రామికుల సంఖ్య పెంచండి : పీడీ


నెల్లూరు(పొగతోట): ఉపాధి హామీ పనులకు హాజరయ్యే శ్రామికుల సంఖ్యను లక్షకు పెంచాలని డ్వామా పీడీ గంగాభవాని ఆదేశించారు. నెల్లూరులోని డ్వామా కార్యాలయం నుంచి ఏపీఓ, ఈసీలు, టీఏలతో శుక్రవారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో పీడీ మాట్లాడారు. ప్రతి రోజూ లక్ష మందికి తక్కువ కాకుండా శ్రామికులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పేమెంట్లకు సంబంధించి ఫీల్డు అసిస్టెంట్లు వివిధ రకాల యాప్‌లను వినియోగించి నగదు డ్రా చేసి ఇస్తే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'కార్పొరేట్' ధిక్కారం

సెలవుల్లో జూనియర్, సీనియర్ ఇంటర్ తరగతులు

ఇంటర్ బోర్డు రూల్స్‌కు కార్పొరేట్ యాజమాన్యాలు తిలోదకాలిస్తున్నాయి. ఏం చేసినా అడిగేనాథుడే లేకపోవడంతో ఇష్టారాజ్యంగా మారింది. ప్రభుత్వ నిబంధనలను అమలు చేయాల్సిన రాష్ట్ర మంత్రి అడ్డదారులు తొక్కుతున్నారనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. వేసవి సెలవులివ్వకుండా యథేచ్ఛగా తరగతులు నిర్వహిస్తున్న పరిస్థితి ఉంది. ఓవైపు అధిక ఉష్ణోగ్రతలు, మరోవైపు చదువుల ఒత్తిడితో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

- విద్యార్థులపై ఒత్తిడి
- ఎండ వేడిమికి అల్లాడుతున్న వైనం
- ముందే ఫీజులు దండుకున్న యాజమాన్యాలు
- మంత్రికి సంబంధించిన కాలేజీల్లో నిబంధనలకు పాతర
- చోద్యం చూస్తున్న ఇంటర్ బోర్డు



జిల్లాలో..
కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు : 162
విద్యార్థులు : 30 వేల మందికి పైగా..

నెల్లూరు(టౌన్): జిల్లాలో మొత్తం 162 కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాలలున్నాయి. వీటిల్లో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 30 వేలమందికి పైగా ఉంటారు. గతనెల 24వ తేదీ నుంచి అధికారికంగా వేసవి సెలవులు ప్రకటించారు. జూన్ 2న కాలేజీలను పునః ప్రారంభించాలని ఆదేశించారు. అయితే ఈనెల 12 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఫెయిలైన విద్యార్థులకు తరగతులు నిర్వహించాలని ఇంటర్ బోర్డు ఆదేశించింది. కార్పొరేట్ యాజమాన్యాలు సెలవులివ్వకుండానే అకడమిక్ తరగతులను ప్రారంభించాయి. పైగా ముందుగానే ఫీజులను వసూలు చేశారు. సిలబస్‌ను ప్రారంభించామని, విద్యార్థులు కళాశాలలకు రాకుంటే నష్టపోతారని బహిరంగంగానే చెబుతుండటంతో చేసేదేమిలేక రోజూ తరగతులకు హాజరవుతున్నారు. ప్రధానంగా ఇంటర్ ప్రథమ సంవత్సర అడ్మిషన్లు చేస్తూ తరగతులు నిర్వహిస్తున్నారు.

తీవ్ర ఒత్తిడిలో..

జిల్లా నుంచి విద్యార్థులు ఇతర జిల్లాలకు ఎక్కడ పోతారోనన్న భయంతో యాజమాన్యాలు వేసవి సెలవులకు ఎగనామం పెట్టి తరగతులు నిర్వహిస్తున్నాయి. తరగతుల కారణంగా విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. పరీక్షలు ముగిశాయన్న ఆనందం లేకుండా పోయిందని లోలోన మదన పడుతున్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఏపీ ఈఏపీ, జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలు జరగాల్సి ఉంది. ఏడాది పొడవునా మార్కులు, ర్యాంకుల పేరుతో ఒత్తిడికి గురి చేస్తున్న పరిస్థితి ఉంది. ఇరుకుగా, గాలి, వెలుతురు అంతంతమాత్రంగానే ఉంటున్న గదుల్లో రోజంతా ఉండలేక పిల్లలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కళాశాలకు వెళ్లలేమని ఇంట్లో చెప్పలేక, అధిక ఉష్ణోగ్రతలకు గదిలో ఉండలేమని అధ్యాపకులకు చెప్పలేక ఆవేదన చెందుతున్నారు.



నెల్లూరులోని ఇంటర్ బోర్డు కార్యాలయం

మాకెందుకులే..

తరగతులు నిర్వహిస్తున్నా జిల్లా ఇంటర్ బోర్డు అధికారులు చోద్యం చూస్తున్నారు. రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణకు సంబంధించిన కళాశాలలే ఎక్కువగా ఉండటంతో అధికారులు చర్యలకు ఉపక్రమించడం లేదన్న విమర్శలున్నాయి. నారాయణ కళాశాలల జోలికెళ్లకుండా మిగిలిన వాటి వద్దకెళ్తే ఎదురు తిరుగుతారన్న భయం యంత్రాంగంలో ఉంది. దీంతో అంతా ఇష్టారాజ్యంగా మారింది. నిబంధనలు అతిక్రమిస్తున్న కార్పొరేట్ యాజమాన్యాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలనే డిమాండ్ ఉంది.

గుర్తింపును రద్దు చేయాలి



ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తున్న ఇంటర్ కళాశాలల యాజమాన్యాల గుర్తింపును రద్దు చేయాలి. ఎన్నడూ లేని విధంగా వేసవి సెలవులివ్వకుండా విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు వారిపై బలవంతంగా చదువులను రుద్దుతున్నారు. కలెక్టర్ దృష్టి సారించాలి.

– ఆదిత్యసాయి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏపీ విద్యార్థి జేఏసీ

పట్టించుకోవడం లేదు



ర్యాంక్‌లు, మార్కుల పేరుతో విద్యార్థులను తీవ్ర ఒత్తిడులకు గురిచేస్తున్న కార్పొరేట్ యాజమాన్యాలపై కేసులు నమోదు చేయాలి. తరగతుల నిర్వహణపై ఇంటర్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఇంటర్ విద్యార్థులకు సెలవులిచ్చేలా జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలి.

– లీలామోహన్, రాష్ట్ర కార్యదర్శి, నవ్యాంధ్ర విద్యార్థి జేఏసీ

తనిఖీలు నిర్వహిస్తాం



ఇంటర్ తరగతుల నిర్వహణపై రోజూ తనిఖీలు నిర్వహిస్తాం. తరగతులు నిర్వహిస్తున్న కళాశాలను గుర్తించి ఆయా యాజమాన్యాలపై ఇంటర్ బోర్డు చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే కాలేజీల ప్రిన్సిపల్స్‌తో కాన్ఫరెన్స్ నిర్వహించి ఆదేశాలు జారీ చేశాం. వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహించరాదు. ఇందులో ఎవరికీ మినహాయింపు లేదు.

– వరప్రసాద్‌రావు, ఆర్‌ఐఓ

పెన్నా నదిలో మృతదేహం



నెల్లూరు(క్రైమ్): పెన్నా బ్యారేజ్ ఒకటి – రెండు పిల్లర్ల మధ్య నీటిలో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం తేలియాడుతుండటాన్ని స్థానికులు గమనించారు. గాంధీగిరిజన కాలనీ వార్డు సెక్రటరీ రమేష్‌బాబుకు వారు సమాచారం అందించారు. ఆయన ఘటనా స్థలానికి చేరుకుని సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంతపేట హెడ్‌కానిస్టేబుల్ ఎస్.ఏడుకొండలు ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సాయంతో మృతదేహాన్ని నీటిలో నుంచి బయటకు తీయించారు. మృతుడి వయసు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉండొచ్చని భావిస్తున్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురికి తరలించి హెచ్‌సీ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందాడా? లేదా ఆత్మహత్య చేసుకున్నాడా?, ఇతర కారణం ఏమైనా ఉందా అని తెలియరావాల్సి ఉంది.

కండలేరులో 44.685 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 44.685 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 850, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 60, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.80 సన్నవి : రూ.40 పండ్లు : రూ.25

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 130 | లేయర్ (లైవ్) : 110
బ్రాయిలర్ చికెన్ : 234
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 260 | లేయర్ చికెన్ : 187

నిఘా పెంపు



కాల్పుల సమయంలో ఇలా నేలపై పడుకోవాలి



ఇటీవల మాక్‌డ్రిల్‌లో భాగంగా క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తూ..



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

- సర్వత్రా అప్రమత్తత
- తీర ప్రాంతంపై ప్రత్యేక దృష్టి
- విస్తృతంగా తనిఖీలు

నెల్లూరు(క్రైమ్): సరిహద్దుల్లో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. పోర్టులు, సముద్ర తీర ప్రాంతాల్లో నిఘాను పెంచారు. జిల్లా వ్యాప్తంగా బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు పోలీసులు అగ్నిమాపక, ఆరోగ్య శాఖల సహకారంతో అదానీ కృష్ణపట్నం పోర్టు, రామాయపట్నం, పొదలకూరులోని రాడార్ స్టేషన్, నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్లలో అనుకోని రీతిలో ఉగ్రదాడులు జరిగినా, బాంబులు పేలినా, అగ్నిప్రమాదాలు వాటిల్లినా? ఎలాంటి స్వీయ రక్షణ చర్యలు తీసుకోవాలి?, ఎలా వ్యవహరించాలి?, సాయం కోసం ఎలా ప్రయత్నించాలి?, క్షతగాత్రులను ఆస్పత్రికి ఎలా తరలించాలి?, మంటలను ఎలా అదుపు చేయాలి? తదితరాలపై ఆపరేషన్ అభ్యాస్ పేరిట మాక్‌డ్రిల్‌ను నిర్వహించి ప్రజలను జాగృత్తం చేశారు. పోర్టు పరిసర ప్రాంతాల్లో పెట్రోలింగ్ పెంచారు. పోర్టులో ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. తీర ప్రాంతాల్లో మెరైన్ పోలీసులతో కలిసి తనిఖీలు నిర్వహిస్తూ స్థానిక ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే షిప్‌లు, అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే వెంటనే 112కు, స్థానిక పోలీసులకు లేదా మెరైన్ పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఎస్పీ ఎప్పటికప్పుడు పోలీసు అధికారులతో మాట్లాడుతూ అవసరమైన సలహాలు, సూచనలిస్తున్నారు.

తీర ప్రాంతంలో అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ కృష్ణకాంత్

ముత్తుకూరు(పొదలకూరు): జిల్లాలోని తీర ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ జి.కృష్ణకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం అదానీ కృష్ణపట్నం పోర్టు, ఏపీ జెన్కో అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భద్రతను కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం భద్రతా వ్యవహారం, భవిష్యత్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమగ్రంగా చర్చించారు. యుద్ధ ప్రభావం తీరప్రాంతాలపై అధికంగా ఉండే అవకాశం ఉందని, పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. మెరైన్ పోలీసుల సహకారంతో పటిష్ట భద్రతతో పాటు నిఘా విభాగం చురుగ్గా పనిచేయాలన్నారు. పోర్టు యాజమాన్యంతో సమన్వయం చేసుకుంటూ భద్రతను కట్టుదిట్టం చేయాల్సిందిగా సూచించారు. ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలన్నారు. సీసీ కెమెరాలు, డ్రోన్లు, బాంబ్, డాగ్ స్క్వాడ్‌లతో ముమ్మర తనిఖీలను నిర్వహించాల్సిందిగా ఆదేశించారు. క్రమం తప్పకుండా పోర్టు ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహించాలని, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. సముద్రంలో వేటపై నిషేధం ఉందన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని, తీర ప్రాంతాల్లో అనుమానాస్పదంగా వచ్చే షిప్‌లు, వ్యక్తుల వివరాలను పోలీసుల దృష్టికి తీసుకోవాల్సిందిగా సూచించారు. సమన్వయ సమావేశంలో పోర్టు, జెన్కో అధికారులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ ఆదేశాలతో ముమ్మర తనిఖీలు

- 26మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు



వాహనపత్రాలను పరిశీలిస్తున్న నవాబుపేట ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

నెల్లూరు(క్రైమ్): ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు యంత్రాగం నేర నియంత్రణకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు జిల్లా వ్యాప్తంగా 2,463 వాహనాలను తనిఖీ చేశారు. లాడ్జీలు, ఆర్టీసీ బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లలో సోదాలు చేశారు. అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న 26 మందిపై, బహిరంగంగా మద్యం తాగుతున్న 24 మందిపై కేసులు నమోదు చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన 102 మందికి రూ.53,485ల జరిమానా విధించారు. ఆరు వాహనాలను సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు

- డీఆర్వో ఉదయభాస్కర్‌రావు



అధికారులతో మాట్లాడుతున్న డీఆర్వో

నెల్లూరు రూరల్: జిల్లాలో ఈనెల 12 నుంచి 20వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియట్ అడ్వాన్స్ డ్ సప్లిమెంటరీ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని డీఆర్వో జె.ఉదయభాస్కర్‌రావు ఆదేశించారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో శుక్రవారం సంబంధిత అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ మొదటి సంవత్సరం పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయన్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి 24,835 మంది విద్యార్థులు హాజరవుతున్నారని, అందుకోసం 65 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే ప్రాక్టికల్ పరీక్షలను ఈనెల 28 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా చూడాలన్నారు. ప్రథమ చికిత్స కిట్లను అందుబాటులో ఉంచాలన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా తాగునీటి వసతి సౌకర్యం కల్పించాలన్నారు. పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ అధికారులు బస్సులను నడపాలని సూచించారు. ప్రత్యేక కంట్రోల్ రూమ్ (0861 – 2320312) పెట్టామన్నారు. సమావేశంలో ఆర్‌ఐఓ వరప్రసాద్‌రావు, జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి మధుబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

టీ అంగడిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు

- 640 భంగ్ గోలీలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సై

నెల్లూరు(క్రైమ్): మత్తు ఇచ్చే భంగ్ గోలీలను విక్రయిస్తున్న ఓ టీ షాపుపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేశారు. గంజాయితో మిళితమైన 640 భంగ్ గోలీలను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ అధికారుల సమాచారం మేరకు.. హోలీ వేడుకల్లో కొందరు జోష్ కోసం గంజాయితో మిళితమైన భంగ్‌ను సేవిస్తూ లోకాన్ని మరిచిపోతారు. ఇలా అధికంగా ఉత్తరాది రాష్ట్రాల్లో జరుగుతుంది. క్రమేపీ మన జిల్లాలోనూ విస్తరిస్తోంది. కొందరు భంగ్‌ను సేవిస్తున్నారు. నెల్లూరు ఇందిరాభవన్ రోడ్డులో టీ దుకాణం నిర్వహిస్తున్న రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన జయకిషన్ భంగ్ విక్రయాలకు తెరలేపాడు. ఆ రాష్ట్రంలో భంగ్ గోలీలను కొనుగోలు చేసి జిల్లాలోని కొందరు రాజస్థానీలకు అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకోసాగాడు. దీనిపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ పి.దయాసాగర్‌కు సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్లు వై.వెంకటేశ్వర్లు, పి.అనితలు తమ సిబ్బందితో కలిసి టీ దుకాణంపై దాడులు చేశారు. 640 భంగ్ గోలీలను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి దర్యాప్తు నిమిత్తం స్వాధీనం చేసుకున్న గోలీలు, నిందితుడిని ఎక్సైజ్ నెల్లూరు – 1 స్టేషన్‌లో అప్పగించారు. ఎక్సైజ్ అధికారులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. దాడిలో ఎస్సై సీహెచ్ పూర్ణకుమార్, హెచ్‌సీలు రమేష్‌కుమార్, కిరణ్‌సింగ్, కానిస్టేబుల్స్ మునిరాజ్‌కుమార్, రమణయ్య పాల్గొన్నారు.

ఘనంగా మెడికల్ కళాశాల ఫ్రెషర్స్ డే



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపల్, సూపరింటెండెంట్ తదితరులు

నెల్లూరు(అర్బన్): దర్గామిట్టలోని ఏసీఎస్ఆర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మొదటి సంవత్సరం వైద్య విద్యనభ్యసిస్తున్న వారికి మూడో సంవత్సరం విద్యార్థులు శుక్రవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ గోవిందు మాట్లాడుతూ డాక్టర్ వృత్తి పవిత్రమైనదన్నారు. కళాశాల మంచి ఫలితాలతో గుర్తింపు తెచ్చుకుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా చదివి మంచి డాక్టర్లుగా మారి ప్రజలకు సేవలందించాలన్నారు. సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను నేర్చుకుని సమాజానికి ఉపయోగపడాలన్నారు. ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్ బాషా మాట్లాడుతూ ఎంతో కష్టపడి ర్యాంక్ సాధించి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో చదవడం అంటే చాలా గొప్ప విషయమన్నారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

- ఉగ్రదాడిలో మృతిచెందిన పర్యాటకులు, దేశ సరిహద్దుల్లో వీరమరణం పొందిన తెలుగు జవాన్ మురళీనాయక్, ఇంకా పౌరులకు మెడికల్ విద్యార్థులు, డాక్టర్లు ఘనంగా నివాళులర్పించారు. దేశానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కాలేషాబాషా, పలువురు డాక్టర్లు పాల్గొన్నారు.